తెలంగాణ తల్లి కన్నీరు పెడుతోంది

ఎమ్మెల్యే ముఠా గోపాల్


రాంనగర్ చౌరస్తాలో తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ నాయకులు

ముషీరాబాద్: తెలంగాణ ఉద్యమకాలంలో రూపొందించిన తెలంగాణ తల్లిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ తల్లిగా మార్చారని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఎద్దేవ చేశారు. మంగళవారం రాంనగర్ చౌరస్తాలో తెలంగాణ తల్లికి పాలాభిషేకం చేసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వాలు మారితే ప్రజల తలరాతలు మారుతాయని అనుకున్నారని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ తల్లిని మారుస్తుందని అనుకోలేదన్నారు. ఇది తెలంగాణ అస్తిత్వంపై జరుగుతున్న దాడి అని తెలిపారు. తెలంగాణ చరిత్ర ఆనవాళ్లను నాశనం చేసేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. తాము ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లిని మార్చకుండా చట్టం చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడాన్ని ఎమ్మెల్యే తప్పుపడుతూ తాము అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజల అభీష్టం మేరకు నడుచుకుంటామని తెలిపారు. గతంలో కేసీఆర్ ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లిలో బతుకమ్మను దూరం చేశారని, కిరిటంలో ఉన్న కోహినూర్ వజ్రాన్ని, వడ్డానంలో ఉన్న జాకబ్ డైమండ్‌ను కనపడకుండా చేశారని రేపు తెలంగాణ అస్తిత్వాన్ని మాయం చేస్తారని దుయ్యబట్టారు. పువ్వులను పూజించే బతుకమ్మ పండుగ తెలంగాణకు మాత్రమే ప్రత్యేకం అని ఆ బతుకమ్మను తెలంగాణ తల్లి నుంచి దూరం చేయడం దురదృష్టకరమని అన్నారు. సెక్రటేరియట్‌లో ముఖ్యమంత్రి ఆవిష్కరించినది తెలంగాణ తల్లి కాదని అది కాంగ్రెస్ తల్లి అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు ముఠా జైసింహ, ప్రభాకర్, ముఠా నరేష్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, సురేందర్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆవిష్కరించింది కాంగ్రెస్ తల్లి విగ్రహమే..: వీఎస్ఆర్

ముషీరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి సెక్రటేరియట్ ఆవరణలో ఆవిష్కరించిన విగ్రహం కాంగ్రెస్ తల్లి విగ్రహమేనని మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. తెలంగాణ తల్లి విగ్రహం మార్పుపై నిరసన వ్యక్తం చేస్తూ ముషీరాబాద్ నియోజకవర్గం విద్యార్థి విభాగం కోఆర్డినేటర్ కార్తీక్‌యాదవ్ ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టే విగ్రహాన్ని తీసేసి కాంగ్రెస్ గుర్తుతో ఉన్న విగ్రహం ఏర్పాటు చేయడం సరైంది కాదన్నారు. నాలుగున్నర కోట్ల తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి విగ్రహాన్ని మార్పులు, చేర్పులు చేశారన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు అజయ్ ముదిరాజ్, నాయకులు సిరిగిరి శ్యామ్, బాల రాజుగౌడ్, సదా, రాజు, సత్యనారాయణ, సిద్దిఖ్, వెంకటేష్, అరుణ్, అమిత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు బస్ భవన్ ఎదుట ధర్నా

ముషీరాబాద్: సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ఆధ్వర్యంలో రద్దు చేసిన బస్సులను పునరుద్ధరించి ప్రయాణికులకు అనుగుణంగా కొత్త బస్సులను అందుబాటులో ఉంచాలని నగర కార్యదర్శి ఎం.హన్మేష్ డిమాండ్ చేశారు. ఆర్టీసీ క్రాస్ రోడ్స్ ముందు బస్ భవన్ ఎదుట ఈనెల 11వ తేదీన ఉదయం 11గంటలకు ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు.

రేపు గీతా పారాయణం

చిక్కడపల్లి: వివేక్‌నగర్‌లోని ప్రసిద్ధ శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో గీతా జయంతి ఈనెల 12న నిర్వహించనున్నారు. శ్రీవేద భారతి కల్చరల్ సొసైటీ నిర్వహణలో సాయంత్రం 5 నుంచి 8గంటల వరకు గీతా పారాయణం, సంకీర్తన విభావరి, సంగీత కళారత్న యరగొల్ల శ్రీనివాస్‌యాదవ్ సంగీత కార్యక్రమం ఉంటుందని ఆలయ ఈవో మాచర్ల దేవనాథం తెలిపారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి


అధికారులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌లో అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ మంగళవారం జీహెచ్ఎంసీ అధికారులకు సూచించారు. కార్పొరేటర్ తన కార్యాలయంలో ఇంజినీరింగ్ డీఈ గీత, ఏఈ అబ్దుల్ సలామ్‌లతో కలసి ఆమె సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్‌లోని పార్కులకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలన్నారు. అరుంధతినగర్‌లో మంజూరైన నూతన రోడ్డు నిర్మాణాకి టెండర్ ప్రక్రియలో ఉందని త్వరలో పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ సంయుక్త కన్వీనర్ వినయ్‌కుమార్, జీహెచ్ఎంసీ ఇన్‌స్పెక్టర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న భక్త అంబరీష హరికథా గానం


సప్పా భారతి భాగవతారిణి 'భక్త అంబరీష'హరికథా గానం చేస్తున్న దృశ్యం

నల్లకుంట: అన్నమయ్య పరివారం, నేతి కుటుంబం, ప్లాంజేరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నల్లకుంట శంకరమఠం ప్రాంగణంలో హరికథా పితామహుడు శ్రీమదజ్జాడ ఆదిభట్ల నారాయణదాస 160వ జయంతి, హరికథా కేసరి నేతి లక్ష్మీనారాయణ భాగవతుల 126వ జయంతి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం సాయంత్రం 5.45 గంటలకు సప్పా భారతి భాగవతారిణి తన మధురమైన స్వరంతో ×భక్త అంబరీష×హరికథా గానం ఆకట్టుకుంది. దీనికి వయోలిన్‌పై డాక్టర్ పాణ్యం దక్షిణామూర్తి, మృదంగంపై ఆర్. సుధాకర్ వాద్య సహకారమందించారు. చివరగా కళాకారులను నిర్వాహకులు శాలువాతో సన్మానించారు.

భార్యా బాధితుల సంఘం కేలండర్ ఆవిష్కరణ


భార్యా బాధితుల సంఘం కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న బాలాజీరెడ్డి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: భార్యా బాధితుల సంఘం 2025 కేలండర్‌ను ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు బాలాజీరెడ్డి మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలాజీరెడ్డి మాట్లాడుతూ... భార్యా బాధితులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు తమ వంతుగా కృషి చేస్తున్నామని అన్నారు. చట్టంతో పోరాడి పురుషులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వాలు తీసుకువచ్చిన చట్టాల మార్పుల తరహాలో మహిళలు పురుషులపై పెట్టే కేసుల విషయంలో కూడా మార్పులు తీసుకురావాలని ఆయన కోరారు. ఈ కేలండర్ ఆవిష్కరణలో సంఘం ఉపాధ్యక్షుడు సందీప్, నాయకులు శేషగిరిరావు, రవికుమార్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

లష్కర్ జిల్లా ఏర్పాటుకు సహకరించాలి


వీహెచ్‌కు వినతిపత్రం అందజేస్తున్న లష్కర్ జిల్లా సాధన సమితి ప్రతినిధులు

అంబర్‌పేట: లష్కర్ ప్రత్యేక జిల్లా ఏర్పాటుకు తోడ్పాటును అందించాలంటూ లష్కర్ జిల్లా సాధన సమితి ప్రతినిధులు మంగళవారం మాజీ ఎంపీ వి.హనుమంతరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకువెళ్లి తనవంతు కృషి చేస్తానని వీహెచ్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు పవన్‌కుమార్‌గౌడ్, ప్రతినిధులు బాలరాజుయాదవ్, శైలేందర్, సునీల్‌కుమార్, శ్రీకాంత్‌రెడ్డి, అబ్దుల్ అజీజ్, కాంగ్రెస్ నాయకులు లక్ష్మణ్‌యాదవ్, కృష్ణగౌడ్, శ్రీకాంత్‌గౌడ్, కె.రాజేశ్వర్‌రావు, గడ్డం శ్రీధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ ఫెడరేషన్ కార్పొరేషన్లకు బడ్జెట్ కేటాయించాలి


బీసీ ఫెడరేషన్ కులాల సమితి సదస్సులో అభివాదం చేస్తున్న నాయకులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: రాష్ట్ర బడ్జెట్‌లో బీసీ ఫెడరేషన్ కార్పొరేషన్లకు అత్యధిక నిధులు కేటాయించాలని తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి రాష్ట్ర అధ్యక్షుడు బల్లవు దుర్గారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్రస్థాయి సమితి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ... స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు కేటాయించాలన్నారు. ఏబీసీడీ వర్గీకరణ చేపట్టాలని కోరారు. బీసీల్లో అత్యంత వెనకబడిన కులాలైన దూదేకుల కులానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సమితి ప్రధాన కార్యదర్శి కీర్తి యుగంధర్, గ్రేటర్ అధ్యక్షుడు సంఘం వీరప్ప, షేక్ సయ్యద్ బాషా, సదానందం చారి, బొగ్గుల సునిత, ఫక్కీర్ ఉద్దీన్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావనను అలవర్చుకోవాలి


అయ్యప్ప మహా పడిపూజలో ముఠా గోపాల్, శ్రీనివాస్‌గౌడ్

ముషీరాబాద్: ముషీరాబాద్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నక్క శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో 36వ అయ్యప్పస్వామి మహా పడిపూజను ముషీరాబాద్ చేపల మార్కెట్ సమీపంలో మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ హాజరై స్వామివారికి పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావనను అలవర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వాములకు భిక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. జంగిరెడ్డి గురుస్వామి నిర్వహించిన భజన కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. వివిధ దేవతామూర్తుల విగ్రహాలను ఏర్పాటు చేయడంతో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. ఈ కార్యక్రమంలో నాయకులు మహేందర్ బాబుగౌడ్, అజయ్, సుమిత్ర, ఎయిర్‌టెల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

'నేతన్నలను ప్రభుత్వం గాలికొదిలేసింది'


చేనేత కార్మిక సంఘం సదస్సులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: తెలంగాణ రాష్ట్రంలో చేనేత కార్మికులు కుటుంబ పోషణకు భారమై ఆత్మహత్యలు, ఆకలిచావులకు గురవుతున్నారని మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ.. చేనేత సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసి కార్మికులను గాలికి వదిలేసిందని విమర్శించారు. చేనేత కార్మికులు ఉపాధిలేక చేసిన కష్టానికి తగిన ఆదాయం రాక ఆర్థిక ఇబ్బందులకు లోనవుతూ ఆత్మహత్యలు చేసుకుంటున్నారు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రభుత్వ రంగ సంస్థలకు కావల్సిన వస్త్రాలను ఉత్పత్తి చేస్తున్న కార్మికులకు వేతనాలు పెంచాలని, చేనేత కార్మికుల ఉపాధి సంక్షేమ అభివృద్ధి బోర్డును ఏర్పాటు చేసి 2వేల కోట్లను కేటాయించాలని కోరారు. చేనేత సహకార సంఘాలకు ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని, కార్మికులకు ఉన్న రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. వనం శాంతి కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కూరపాటి రమేష్, గంజి మురళీధర్, కందగట్ల స్వామి, గడ్డం జగన్నాథం, లక్ష్మీనర్సయ్య, చిక్కా దేవదాస్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

బూత్‌స్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఎన్.గౌతంరావు

కాచిగూడ: బూత్ స్థాయి నుంచి బీజేపీని మరింత బలోపేతం చేయాలని హైదరాబాద్ సెంట్రల్ జిల్లా పార్టీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు పిలుపునిచ్చారు. మంగళవారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పార్టీ సంస్థాగతంగా బలంగా ఉన్నప్పుడే ఎన్నికల్లో ఆశించిన ఫలితాలు వస్తాయన్నారు. గుజరాత్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో బీజేపీ బలమైన శక్తిగా అవతరించడం వెనుక బలమైన బూత్ కమిటీల నిర్మాణం ఉందన్నారు. పార్టీ ఆదేశాల మేరకు పూర్తిస్థాయిలో బూత్ కమిటీలను ఏర్పాటు చేయాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నేతలు మనోహర్‌రెడ్డి, జె.శ్రీకాంత్, సందీప్‌సాయి, ఆనంద్‌గౌడ్, అజయ్, కృష్ణగౌడ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కాలేరుకు కేసీఆర్ ఆశీర్వాదం


ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ దంపతులను ఆశీర్వదిస్తున్న మాజీ సీఎం కేసీఆర్

అంబర్‌పేట: అంబర్‌పేట నియోజకవర్గం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ జన్మదిన వేడుకలు నిరాడంబరంగా జరిగాయి. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ఆయన అభిమానులు మంగళవారం నియోజకవర్గం వ్యాప్తంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో ఎమ్మెల్యేను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి అభిమానాన్ని చాటుకున్నారు. అన్నదానం, పండ్ల పంపిణీ, వంటి సేవా కార్యక్రమాలను చేపట్టారు. అనంతరం ఎమ్మెల్యే తన కుటుంబ సభ్యులతో కలిసి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్ ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించారు.

నేటి నుంచి ఆరాధన సంగీతోత్సవాలు

నల్లకుంట: శ్రీ భద్ర పీఠం ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీ నుంచి 14వ తేదీ వరకు దివంగత రాజా తూము లక్ష్మీనరసింహ దాసు 191వ ఆరాధన సంగీత మహోత్సవాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని ఆధ్యాత్మిక ప్రచారక్, భద్రపీఠం ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు తూము వేంకట రామకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. రామకోఠిలోని శ్రీశక్తి గణపతి ఆలయ ప్రాంగణంలో 11వ తేదీన సాయంత్రం 7.02గంటలకు ప్రముఖ సంగీత విద్వాంసులు విద్వాన్ కె. వాసుదేవరావు, కె.సాయి సరయు బృందం చే గానం ఉంటుందని చెప్పారు.

- 12వ తేదీన సాయంత్రం 6.03 గంటలకు మెహిదీపట్నం గుడిమల్కాపూర్‌లోని ఉమా పార్వతి సమేత త్రయంబకేశ్వరస్వామి, జయదుర్గ, శిరిడీ సాయిబాబా మందిరం ప్రాంగణంలో సంగీత విద్వాన్ ఐ.సుబ్రహ్మణ్యం, సంగీత విదుషీమణి దువ్వూరి ఉషశ్రీ బృందంచే సంగీత కార్యక్రమం ఉంటుందని చెప్పారు.
- 14వ తేదీన సాయంత్రం 6 గంటలకు అలకాపూర్‌కాలనీలోని తుల్జారామ్‌బాగ్ దేవాలయం ప్రాంగణంలో ప్రముఖ సంగీత విద్వాంసులు మైలవరపు శారద, ఐ. సుబ్రహ్మణ్యం బృందంచే సంగీత కచేరి ఉంటుందని తెలిపారు. సంగీత అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని ఆరాధనోత్సవాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

శ్రీదత్త జయంతి మహోత్సవం 14న

నల్లకుంట: న్యూనల్లకుంట బ్రాహ్మణ హాస్టల్ సమీపంలోని దత్తపీఠం వద్ద ×శ్రీ దత్త జయంతి× వేడుకలను ఈనెల 14న నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఫ్రెండ్స్ అసోసియేషన్ ప్రతినిధి సీహెచ్. సాయిమోహన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 9.30గంటలకు దత్తాత్రేయస్వామికి పూజలు, హోమం ఉంటుందన్నారు. మధ్యాహ్నం అన్నదానం ఉంటుందని తెలిపారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌తో పాటు నల్లకుంట, బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్లు హాజరవుతారని చెప్పారు.

సన్మానం


వీణా విద్వాంసురాలు మల్లాది శాంత మూర్తిని సన్మానిస్తున్న శ్రీనివాస శర్మ

నల్లకుంట: గీతా జయంతిని పురస్కరించుకొని మంగళవారం సాయంత్రం ప్రముఖ వీణా విద్వాంసురాలు మల్లాది శాంతామూర్తి సన్మానించుకున్నారు. శ్రీసరస్వతి సంగీత విద్యాలయం ప్రిన్సిపల్, పంచశత వీణా గాన రత్న పోపూరి శ్రీనివాసశర్మ మంగళవారం ఆమెను సన్మానించిన నూతన దుస్తులు అందజేశారు.

సైబర్ సెక్యూరిటీ కోర్సుల్లో ఆన్‌లైన్ శిక్షణ

కాచిగూడ: కేంద్ర ప్రభుత్వ ఆమోదిత నేషనల్ అకాడమీ ఆఫ్ సైబర్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు గల వివిధ సైబర్ సెక్యూరిటీ అండ్ ఎథికల్ హ్యాకింగ్ కోర్సుల్లో ఆన్‌లైన్‌లో శిక్షణకై రాష్ట్ర వ్యాప్తంగా దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ విమలారెడ్డి తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ డిప్లొమా అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 21వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు ఫోన్ నం: 78931 41797.

భారత్ సేవాశ్రమం సేవలు అభినందనీయం

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ


కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న గరవ్నర్ జిష్ణుదేవ్ వర్మ

కవాడిగూడ: నిరుపేదలను ఆదుకునేందుకు ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సూచించారు. పేదలను ఆదుకునేందుకు భారత్ సేవాశ్రమం అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. మంగళవారం భరత్ సేవాశ్రమం ఆధ్వర్యంలో లోయర్ ట్యాంక్ బండ్‌లో జీహెచ్ఎంసీ కార్మికులకు ఉచితంగా దుస్తుల పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆశ్రమంలోని ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భారత్ సేవాశ్రమం నగర అధ్యక్షుడు స్వామి మునీశ్వారనంద, కార్యదర్శి స్వామి వెంకటేశ్వరానంద ఆధ్వర్యంలో దాదాపు వెయ్యి మంది నిరుపేదలకు, మున్సిపల్ కార్మికులకు దుస్తులు, దుప్పట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ మాట్లాడుతూ... దేశంలో ఎక్కడ విపత్తులు సంభవించినా భారత్ సేవాశ్రమం బాధితులను ఆదుకోవడంలో ముందుంటుందన్నారు. వారి సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. భారత్ సేవాశ్రమ సేవలు మరింత విస్తరించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులతో పాటు పేదలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

'భగవద్గీత శ్లోకాలు సన్మార్గంలో నడిపిస్తాయి'


బహుమతులు, సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో టీటీడీ కల్యాణ మండపం మేనేజర్ నీరజ

కాచిగూడ: పిల్లలు భగవద్గీత శ్లోకాలు నేర్చుకోవడం వల్ల అవి వారిని సన్మార్గంలో నడిపిస్తాయని టీటీడీ కల్యాణ మండపం మేనేజర్ నీరజ పేర్కొన్నారు. గీతా జయంతి సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం హిమాయత్‌నగర్‌లోని టీటీడీ కల్యాణ మండపంలో విద్యార్థులకు భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. భగవద్గీత శ్లోకాలు నేర్చుకోవడంతో పాటు విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. పరిషత్ ప్రోగ్రామ్ అసిస్టెంట్ హరినాథ్, జూనియర్ అసిస్టెంట్ సతీష్‌కుమార్, విశ్వేశ్వర్‌రావు, రుక్మిణికుమారి, సృజన, పద్మజారామ్, శ్రీదేవి, సత్యవాణి, పూర్ణ, రేణుకాదేవి, కేశవమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నగర గ్రంథాలయ చైర్మన్ ఉపేందర్‌రెడ్డికి శుభాకాంక్షలు

చిక్కడపల్లి: హైదరాబాద్ నగర కేంద్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నియమితులైన కేశిరెడ్డి ఉపేందర్‌రెడ్డిని సంస్థ కార్యదర్శి పొట్లూరి పద్మజ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు మొక్కను అందజేసి సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. చిక్కడపల్లి నగర గ్రంథాలయంలో గురువారం ఆయన బాధ్యతలు స్వీకరిస్తారని అన్నారు. రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్, గ్రంథాలయ, ఉద్యోగులు అవినాష్, వేంకటేశ్వర్‌రెడ్డి, సుకేష్, రాంమోహన్, బొల్లం మహేందర్, వెంకటేష్‌యాదవ్, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

చోరీ కేసులో ఐదుగురు మైనర్ల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సుల్తాన్‌బజార్ ఏసీపీ కె.శంకర్, ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్

కాచిగూడ: తాతా గారింట్లో తన స్నేహితులతో కలిసి దొంగతనానికి పాల్పడిన ఐదుగురు మైనర్ బాలురను నారాయణగూడ పోలీసులు అరెస్ట్ చేసి జువైనల్ హోమ్‌కు తరలించారు. నారాయణగూడ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇన్‌స్పెక్టర్ యు.చంద్రశేకర్, డీఐ డి.నాగార్జున, డీఎస్ఐ జి.వెంకటేష్‌తో కలిసి సుల్తాన్‌బజార్ ఏసీపీ కె.శంకర్ వివరాలు వెల్లడించారు. రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి యర్రవెల్లి శ్రీధర్ (75) నారాయణగూడ గాంధీకుటీర్ ప్రాంతంలో ఉంటున్నాడు.

- అతడి భార్య రాజేశ్వరి 12 ఏళ్ల క్రితం చనిపోయింది. ఆమె 14 తులాల బంగారు, వెండి అభరణాలు, రూ.20వేల నగదును ఇంట్లోని బీరువాలో ఉంచారు. తన మనవడు (11ఏళ్లు) ఇంటి తాళాలు ఇవ్వాలని పలుమార్లు అడిగినా శ్రీధర్ ఇవ్వలేదు. ఈనెల 7వ తేదీన రాత్రి డిన్నర్ కోసం చపాతీలు తీసుకోవడానికి బయటకు వెళ్లగా టీవీ చూస్తాను ఇంటి తాళాలు ఇవ్వాలని శ్రీధర్‌ను మనవడు అడుగగా ఇంటి తాళాలు ఇచ్చి బయటకు వెళ్లాడు.
- ఈనెల 8వ తేదీన కోడుకు శ్రీనివాస్‌కు డబ్బులు ఇవ్వడానికి వెళ్దామని బీరువా తీసి చూడగా బంగారు ఆభరణాలు, నగదు కనిపించలేదు. మనవడు, అతని నలుగురు స్నేహితులు తీసుకువెళ్లి ఉంటారని అనుమానించిన శ్రీధర్ వెంటనే నారాయణగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారించగా బంగారు ఆభరణాలు, నగదు తీసుకెళ్లినట్లు వారు ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి 13 తులాల బంగారు ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శ్రీధర్ మనవడితో పాటు మరో నలుగురు మైనర్లను పోలీసులు అరెస్ట్ చేసి జువైనల్ హోమ్‌కు తరలించారు.